ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
గురువారం | ఆగస్టు 20, 2026 | సంపుటి : 7 | సంచిక : 71 | పేజీలు : 2




## ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

## ఫొటో జర్నలిస్టులకు సన్మానం

**వరంగల్, ఆయుధం:**
ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఫొటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులను శాలువాతో సన్మానించి మెమొంటో అందించారు. ప్రతీ ఫొటో జర్నలిస్టుకు 2,000/- రూపాయల నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు పాడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, సంపెట సుధాకర్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్, ఎండీ.నయీంపాషా, ఫొటో గ్రాఫర్లు దాసరి శ్రీనివాస్, మంగనూరి మురళి, గొట్టె వెంకన్న, చేతి శ్రీనివాస్, కుడుతుల రమేష్, మాషూక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

- పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది
- ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్.నాగరాజు

**హనుమకొండ, ఆయుదం;** ప్రజల విశ్వాసం కోల్పోయిన మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్.నాగరాజు పేర్కొన్నారు. హనుమకొండలోని డిసిసి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యేలు చల్ల ధర్మారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్ ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానేసి వాస్తవాలను అంగీకరించాలని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ప్రజా ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చి పేదల ఇళ్లను కూల్చివేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యేదేనని అన్నారు. సీఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేసిన వ్యక్తి ప్రజలకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కౌకొండ గుట్టల ప్రాంతంలో చిన్న రైతుల నుంచి రూ.2 లక్షలు, రూ.3 లక్షలకు భూములు కొనుగోలు చేసి, ప్రజాధనంతో రోడ్లు వేయించి అదే భూములను రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించిన చరిత్ర చల్ల ధర్మారెడ్డిదేనని ఆరోపించారు. పరకాల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యాలు చెప్పలేదని స్పష్టం చేశారు. మొత్తం దాదాపు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు గత టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.6.19 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, దాంతో దాదాపు 16 నెలల పాటు పనులు (మిగతా 2 లో..)



## సర్ ను పకడ్బందీగా పూర్తి చేయాలి

- మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి
- డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలి
- అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అన్ని చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

2 లో

## మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి

- 22A నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలి
- రేవంత్ తీరు పిచ్చోడి చేతిలో రాయిలా మారింది
- నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం

**హైదరాబాద్, ఆయుధం:**
నిషేధిత భూముల వ్యవహారంలో నైతిక బాధ్యత వహించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి లో 22A నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి తీరు పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. కొత్త సమస్యలను సృష్టిస్తోంది. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22A నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి? ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు అధికారుల (మిగతా 2 లో..)






## సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైమ్ పోలీసులు

**హనుమకొండ, ఆయుధం:** సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం అనుసరిస్తున్న నూతన మోసపూరిత విధానాలపై పోలీసు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ మోసం, ఇన్వెస్ట్‌మెంట్ మోసం, రిమోట్ యాక్సెస్ యాప్ మోసం, బ్యాంక్/KYC అప్‌డేట్ మోసం వంటి సైబర్ నేరాల తీరును వివరించారు. డిజిటల్ అరెస్ట్ మోసంలో పోలీసు లేదా ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ, బాధితులను ఏదో కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు వసూలు చేసే విధానాన్ని వివరించారు. అలాగే ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు దోచుకునే విధానం గురించి అవగాహన కల్పించారు. రిమోట్ యాక్సెస్ యాప్ మోసాల్లో అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించి మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించే విధానాన్ని, బ్యాంక్/KYC అప్‌డేట్ మోసాల్లో KYC నవీకరణ పేరుతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, OTPలను సేకరించి మోసాలకు పాల్పడే విధానాలను వివరించారు.
ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు ముఖ్య సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించరాదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించే ముందు వాటి నిజానిజాలను తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. తెలియని లేదా అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. అదేవిధంగా OTP, PIN, CVV, పాస్‌వర్డ్‌లు, ఇతర రహస్య బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ తెలియజేయరాదని స్పష్టం చేశారు. పోలీసులు, బ్యాంకు అధికారులు లేదా ప్రభుత్వ అధికారులు ఎవరైనా ఫోన్ ద్వారా రహస్య బ్యాంకింగ్ వివరాలు, OTPలు అడగరని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా లావాదేవీలను నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సైబర్ భద్రతపై మరింత అవగాహన కల్పించే ఉద్దేశంతో సైబర్ అవేర్‌నెస్ క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో ఎం.వెంకటరమణ, కేయూ సీఐ రవికుమార్, SIలు శ్రావణి, చరణ్, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, కానిస్టేబుల్ జాహురుద్దీన్తో పాటు SPARC క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## వరంగల్‌ను ఐదేళ్లలో.. స్వచ్ఛ సిటీగా మార్చాలి

- సరైన ప్రణాళికలను రూపొందించాలి
- ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- హనుమకొండ కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి

**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం ఛాంబర్ నుండి... గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్)పై మున్సిపల్ అధికారులు, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, ఐఐటీ చెన్నై, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చెన్నై సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల(తడి, పొడి చెత్త వ్యర్థాల) నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ తడి, పొడి చెత్త వ్యర్థాల నిర్వహణలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెరుగైన నిర్వహణ కోసం తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. పెరుగుతున్న ఘన వ్యర్థాల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నుండి వచ్చే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి సేకరించడం ద్వారా వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు.
ప్రజలకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజల సహకారం,మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు సమన్వయంతో పనిచేస్తే నగరం క్లీన్, గ్రీన్ సిటీగా మారుతుందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపై సరైన ప్రణాళిక పరిశోధనతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను రాబోయే ఐదు సంవత్సరాలలో స్వచ్ఛత నగరంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలో నిర్వహణపై పరిష్కార చర్యలకు పరిశోధన, నిర్వహణ సహాయ సహకారాలు అందిస్తూ జీడబ్ల్యూఎంసీ స్వచ్ఛ సిటీ గా మార్చుటకు రాబోయే 5 సంవత్సరాలలో చేయూత అందించుటకు MS స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఐఐటీ మద్రాస్, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ అఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చెన్నై ముందుకు రావటం జరిగింది. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రతిభా గణేషన్, రాజమోహన్ రెడ్డి, సంస్థల ప్రతినిధులు హర్షవర్ధన్, అరవింద్, గౌతమ్ కృష్ణ , ఇందుమతి, తానీషి పొన్నమ్మ, అన్నపూర్ణ కశ్యప్, ప్రీతి, దివ్య, మాలవి, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు

- పోచమ్మ మైదాన్ సెంటర్ లో భారీ కేకును కట్ చేసిన కొండా సుస్మిత పటేల్

**వరంగల్, ఆయుధం:** రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ యువనాయకురాలు కొండా సుస్మిత పటేల్ (చిట్టక్క) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణుల మధ్య కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ లతో కలిసి కొండా సుస్మిత పటేల్ గారు 62 కిలోల భారీ కేక్ ను కట్ చేశారు. అనంతరం జర్నలిస్టులు, వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ వర్కర్లు, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పోచమ్మ మైదాన్ సెంటర్ లో అన్నదానం నిర్వహించారు. కొండా సురేఖ ఉంటే అమ్మ ఉన్నట్లే.. ఆమెను మళ్లీ మంత్రిని చేసుకోవాలి.. కొండా సురేఖ మంత్రిగా ఉంటే అమ్మ ఉన్నట్లేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ ఎమ్మెల్యేగా కొండా సురేఖను గెలిపించుకొని మంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఇంటికి పెద్ద కొడుకు లాంటివాడని చెప్పారు. ప్రజల సమక్షంలో తన తల్లి కొండా సురేఖ జన్మదిన వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కొండా దంపతుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలా?" 2008లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ULCని రద్దు చేసింది, ఆ తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారి, ఏళ్లుగా ప్రజలు అక్కడ నివసిస్తున్నారు. 20 ఏళ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారు. రంగారెడ్డిలో 7,500 జీఓల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో 6,000కు పైగా భూములు, HMDA, HUDA భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై పట్టు సాధించేందుకే నిషేధిత భూముల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భూమిని అమ్మడానికి వెళ్లే వరకు అది తమదా, నిషేధిత జాబితాలో ఉందా అనే విషయం కూడా ప్రజలకు తెలియడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. లక్షలాది స్థలాలు, ఇళ్లను జాబితాలో చేర్చారు.

పెద్ద తప్పు చేసి ఇప్పుడు సారీ చెబుతున్నారు. సారీ చెబితే ప్రజల బాధలు తీరుతాయా? అసలు జాబితాలో భూములను చేర్చింది ఎవరు? చేర్చమని ఆదేశించింది ఎవరు? ఇష్టానుసారంగా జాబితాలో పెడతారా? అధికారుల పేర్లు చెప్పి తప్పించుకుంటారా?. నిషేధిత భూముల వ్యవహారంలో నైతిక బాధ్యత వహించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. నిషేధిత జాబితాలో పెట్టింది మీరే కాబట్టి.. తీసేయాల్సింది కూడా మీరే. ఎట్లా పెట్టారో.. అట్లాగే తొలగించండి. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోకుండా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. "ఇది ఎంత దగా ప్రభుత్వం ? నైతిక విలువలు ఉంటే నైతిక బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి. 22A నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలు, తొలగించిన భూముల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి ప్రభుత్వం వైట్ పేపర్ విడుదల చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సంబంధిత మంత్రిని పదవి నుంచి తొలగించాలి. మంత్రి చేసిన తప్పులకు సీఎం చర్యలు తీసుకోకపోతే.. ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయి. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పు చేసిన ఈ కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తాం. 22A నిషేధిత భూముల విషయంలో అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. కేసీఆర్ నాయకత్వంలో మేమంతా ప్రజలకు అండగా ఉంటాం. తెలంగాణ భవన్ జనతా గ్యారేజీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఎవరికైనా సమస్య ఉంటే రండి.. మేము మీకు అండగా ఉంటాం. కేసీఆర్ పోరాడి తెలంగాణ సాధించారు. రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది.'' అని హరీశ్ రావు పేర్కొన్నారు.



# మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో మంత్రి సురేఖ జన్మదిన వేడుకలు

- **పేదల పక్షపాతి మంత్రి సురేఖ : మాజీ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్**

**వరంగల్, ఆయుధం:** రాష్ట్ర మంత్రి, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ జన్మదినం సందర్భంగా 37వ డివిజన్ లోని ఏకశిల పార్క్, శంభుని గుడి ముందు మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలో భాగంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిధులుగా 37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ పాల్గొని కేక్ కట్ చేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణ సురేష్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సేవా చేస్తున్న కుటుంబం కొండా దంపతులు అని సహాయం కోసం వెళ్లిన ప్రతి ఒక్కరికి అండగా ఉండే వారని తెలిపారు. మంత్రి కొండా సురేఖ ఆ దేవుడి ఆశీస్సులతో భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు పొంది పేదలకు మరింత సేవ చేయాలని వారు ఆరోగ్యం ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లం కేశవ రాజ్, రాజబోయిన రాజమల్లు, సాంబ మూర్తి, సతీష్, అశోక్, జన్ను అఖిల్, గొర్రె దశరథ్, ప్రసాద్, రమేష్, రాణి, మున్సిపల్ కార్మికులు, పార్క్ లో పనిచేసే కార్మికులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం ఆధ్వర్యంలో...



**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్లో అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ మురళీధర్ రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్, పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సెక్రటరీ గులాం సర్వర్, కోశాధికారి మల్లూరి బాబురావు, కర్ర వెంకటేశ్వరరావు, పర్శ వీరన్న, గోపి, శీలం సత్యనారాయణ, భారతి వెంకటేశ్వర్లు, రాజు, నాగరాజు, పి.యాకూబ్, శరత్, వెంకటేశ్వర్లు, శ్రీను, యోగి, రణదీప చిన్న, హమాలి కార్మికులు సాంబయ్య పాల్గొన్నారు.

## 23వ డివిజన్‌లో..



**వరంగల్, ఆయుధం:** దేవాదాయ ధర్మాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు సందర్భంగా కొత్తవాడ కొండా లక్ష్మణ్ బాబూజీ జంక్షన్ వద్ద 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో భాషకర్ల హరికృష్ణ పటేల్, రేహన, నాగవెల్లి రాజు, రాళ్లబండి ఉమా, బూర శారద, కందకట్ల సరళ, చింతకాయల రమ, జయశ్రీ, రాళ్లబండి సుభద్ర, కాముని సుభద్ర, ఆడెపు శ్రీలత, బాసబత్తిని అశ్విని, గణపతి, రజాక్, రాములు, కుడికాల రమేష్, కాసోజు సురేందర్, రాపెల్లి మొగిలి, ఎండి.రఫీక్, మల్లేశం, వెంకటేశ్వర్లు, వినయ్, నవీన్, తదితరులు ప్రజలు పాల్గొన్నారు.



## ఏడుపాయల వనదుర్గ ఆలయంలో పూజలు

**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు కొండా సురేఖ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ కొండా సురేఖ మురళీధర్ ఆయురారోగ్యాలతో శత సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఆనందంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు పట్టూరి సుధాకర్, ముద్దినేని మధు, అశోక్, సతీష్, సంతోష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

**కాలాన్ని ఒడిసిపట్టే**

# మన వరంగల్ ఫోటో జర్నలిస్టులు



వరంగల్ అంటే ఒక చైతన్యం, ఒక ఉద్యమ చిహ్నం, ఒక నిత్య నూతన నగరం... ఇలాంటి జిల్లాలో నేను ఉద్యోగంలో ప్రవేశించిన సహాయ పౌర సంబంధాల అధికారిగా, ములుగు డివిజనల్ పీఆర్ఓ గా, జిల్లా పౌర సంబంధాల అధికారిగా దాదాపు 14 ఏళ్ల పాటు పనిచేసాను, ఒక విధంగా చెప్పాలంటే నా స్వంత జిల్లా నల్గొండ అని కూడా మరచిపోయాననే చెప్పొచ్చు.

వరంగల్ లో పనిచేసిన సమయంలో నా వృత్తి ననుసరించి పాత్రికేయులతో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది, పని చేసాను కూడా. ఇక్కడ నను పని చేసిన సమయంలో ఉన్న జర్నలిస్టుల్లో ప్రస్తుతం హైదరాబాద్ లోని పలు మీడియా చానళ్లు, పత్రికల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. వారందరిని చూసి నాకు సంతోషం కలుగుతుంది.

ఇక వరంగల్ లో అత్యంత ఆక్టివ్ గా ఉండే జర్నలిస్టుల్లో ఫోటో జర్నలిస్టులనే చెప్పవచ్చు. మొబైల్ ఫోన్ ల ప్రవేశంతో ఫోటో జర్నలిస్టుల ప్రభావం తగ్గినట్టు కన్పించినా, వరంగల్ ఫోటో జర్నలిస్టులు మాత్రం తమ ప్రొఫెషనలిజం తో మాత్రం ఈ ప్రయారిటీని ఇప్పటికీ కొనసాగిస్తూనే వున్నారు. వరంగల్ కేంద్రంగా వివిధ తెలుగు, ఇంగ్లిష్ పత్రికలకు చెందిన దాదాపు పదిహేను మంది ఫోటో జర్నలిస్టులు ఆక్టివ్ గా ఉన్నారు. రిపోర్టర్లు ఎలా ఉన్నా ఫోటోగ్రాఫర్లు మాత్రం అలర్ట్ గా ఉండాలి. ఫోటో జర్నలిజంలో క్లారిటీ కన్నా కాంటెంట్ దే ఇంపార్టెంట్. వరంగల్ ప్రెస్ ఫోటోగ్రాఫర్లలో ఒక్కొక్కరిదీ ఒక్కొక్క ప్రత్యేకత.

నేను పనిచేసిన సమయంలో ఫోటో జర్నలిస్టులుగా ప్రముఖంగా ఉన్న వారిలో, జ్యోతి దాసరి శ్రీనివాసులు, వార్తశ్యామ్, ఆంధ్ర భూమి (ప్రస్తుతం హన్స్) గోకారపు శ్యామ్, హిందూ మురళి, గొట్టె వెంకన్న, ఈనాడు చేతి శ్రీనివాస్, వార ప్రసాద్, జ్యోతి వీరగోని హరీష్, కె. రమేష్,

దాసరి శ్రీనివాసులు వరంగల్ లో ప్రస్తుతం ఉన్న ప్రెస్ ఫోటోగ్రాఫర్లలో అందరికన్నా సీనియర్ శ్రీనివాసులు. ఆంధ్ర జ్యోతో ఫోటోగ్రఫర్ గా సుదీర్ఘ కాలం పనిచేసి ఆంధ్ర జ్యోతిలోనే రిటైర్ అయిన శ్రీనివాస్ దిఅత్యంత సున్నిత మనస్తత్వం. ఫోటో జర్నలిజం తప్ప మరే వ్యాపకం లేకుండా ఉండే శ్రీనివాస్ 2003 లో గోల్కొండ, 2008 లో గౌతమీ ఎక్ష్‌ప్రెస్ రైళ్ల దుర్ఘటనలసందర్భంగా తీసిన స్పాట్ ఫోటోలు తన కెరీర్ లోనే హైలెట్ అని చెప్పుకుంటారు. 'ఫోటో జర్నలిస్టుకు వేగం అవసరం. దీనితోపాటు మంచి పబ్లిక్ రిలేషన్స్, ఫిజికల్ ఫిట్నెస్ తోపాటు ధైర్యం, చొరవ, ఓపిక అవసరం. ఫోటో జర్నలిస్ట్ వృత్తి కత్తిమీద సాము లాంటిది' అని సీనియర్ జర్నలిస్టు శంకేశి శంకర్ రావు కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుత యువ ఫోటోగ్రాఫర్లకు నిత్యా స్ఫూర్తి దాసరి శ్రీనివాస్. రిటైర్ అయినా తన ఫోటోగ్రఫీ ని కొనసాగిస్తూ ఉన్నారు.

వార్త శ్యామ్ సన్నగా, తన శరీరానికి మించి బరువు గల ఫోటో కెమెరా బ్యాగ్ తో నిత్యం కనిపించే శ్యామ్, అదే, వార్త శ్యామ్ @ సకినాల శ్యామ్, నిజంగానే నూటికి నూరు శాతం ప్రొఫెషనల్ జర్నలిస్ట్. జీవితంలో ప్రతీ జర్నలిస్టుకు ఉండే ఈతి బాధలను ఎదురీనుతూనే తన ఫోటో జర్నలిస్ట్ వృత్తిని మాత్రం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. శ్యామ్ అంటే తెలియని నాయకుడు, ప్రజా సంఘాల వారు, చోటా మోటా లీడర్లు, అధికారులు లేరంటే అతి శయోక్తి కాదు.

భూమి, ప్రస్తుత హాన్స్,గోకారం శ్యామ్ నిత్యం చురుకుగా, ఫోటోగ్రఫీ తప్ప మరేఇతర వ్యాపకం లేని గోకారపు శ్యామ్ కుమారపల్లి వాస్తవ్యుడు. తోటి ఫోటోగ్రాఫర్లకు చేదోడు వాదోడుగా ఉండే శ్యామ్ సౌమ్యుడు, ఎప్పుడూ సరదాగా ఉంటాడు. నిత్యం చిరునవ్వుతో అందరిని గౌరవంగా పలకరించే శ్యామ్ తన ప్రొఫెషన్ లో ఎన్నో అవార్డులు స్వీకరించారు.

హిందూ మురళి పూర్తిగా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ గా ఉండే మురళి అద్భుతమైన ఫోటోలు తీస్తాడు. అటు ప్రెస్ ఫోటోగ్రాఫర్ గా ఉంటూనే పూర్తిగా మీడియా రంగాన్నేనమ్ముకోకుండా హన్మకొండ చౌరస్తాలో ఫోటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఏ ఫోటో కావాలన్నాచిటికలో ది బెస్ట్ ఫోటోలను అందిస్తాడు. అందుకే, హైదరాబాద్, ఢిల్లీ తోపాటు అంతర్జాతీయ రిపోర్టర్లు వరంగల్ లో ఏ ప్రధాన సంఘటన జరిగినా మురళి పైనే ఆధార పడతారు.

ఈనాడు చేతి శ్రీనివాస్ చురుకుదనం, నిరంతరం అప్రమత్తత, వార్తాఅంశాన్ని పట్టే స్ఫుర దృష్టి... ఫోటోగ్రాఫర్ కుండాల్సిన ప్రధాన లక్షణాలు. ఇవ్వన్నీ కలబోసిన నిజమైన ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ చేతి శ్రీనివాస్. నేను వరంగల్ డీపీఆర్ఓగా ఉన్న సమయంలో నిర్వహించిన మేడారం జాతర ఫోటో కాంపిటీషన్ లలో ప్రతీ సారి కచ్చితంగా ఒక ప్రయిజ్ ను గెలిచే వారిలో తప్పకుండా చేతి శ్రీనివాస్ ఉండేవాడు. కేవలం వరంగల్ లోనే కాకుండా హైదరాబాద్, విజయనగరం, మచిలీపట్టణం లలోనూ పనిచేసి అక్కడి వార్తా చిత్రాలను ప్రపంచానికి అందించాడు.

జ్యోతి హరీష్ ఆంధ్ర జ్యోతి ప్రెస్ ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్న వీరగోని హరీష్ ప్రొఫెషనలిజానికి మరోపేరుగా చెప్పవచ్చు. తన చురుకైన చూపులతో నిత్యం వార్తాఅంశాలను పరిశీలిస్తాడు. గ్రామీణ జీవనశైలి, ప్రకృతి లోని అందాలను ఎంతో అందంగా తన కెమెరాలో బంధిస్తాడు. వరంగల్ లోని చారిత్రిక ప్రదేశాల చిత్రాలు అద్భుతంగా తీసాడు. నేను రాసిన వరంగల్ లో అసఫ్ జాహి నిర్మాణాలకు సంబంచిన ఫోటోలు కావాలని నేను అడగగా వెంటనే పంపించాడు. డ్రోన్ కెమరాతో వరంగల్ కొత్త కలెక్టరేట్ భవనం, వరంగల్ లోని నిజామ్ నిర్మాణ భవనాల ఫోటోలను అద్భుతంగా తన కెమెరా ద్వారా బంధించాడు.

గొట్టె వెంకన్న చూడడానికి కామ్ గా ఉండే వెంకన్న ప్రొఫషనలిజం లో అత్యంత ఫాస్ట్ గా ఉంటాడు. ఏ అసైన్మెంట్ ఇచ్చినా భుజానికి సంచి అదే, కెమెరా బ్యాగ్ వేసుకొని వెళ్లి నిశ్శబ్దంగా ఆ పని పూర్తి చేసుకొని రావడమే ఆయన లక్ష్యం గా పనిచేస్తాడు.

వరప్రసాద్ సాక్షి ఫోటోగ్రాఫర్ గా జిల్లా వాస్తవ్యులు పరిచితులైన వరప్రసాద్ మంచి ప్రతిభ నైపుణ్యాలు కలిగిన జర్నలిస్ట్. వరంగల్ కోటకు చెందిన ప్రసాద్ తన వృత్తి మినహా మరే వ్యాపకం లేని నికార్సైన ప్రెస్ ఫోటోగ్రాఫర్.

సంపెట వెంకటేశ్వర్లు ఫోటో జర్నలిస్టుగా దాదాపు (25) సిల్వర్ జూబ్లీ అనుభవం ఉన్నప్పటికి నిత్య విద్యార్థిగానే కనిపిస్తాడు. ఎప్పుడు చిరునవ్వుతో కనిపించే వెంకటేశ్వర్లు అందరి మాదిరిగానే మానుకోట సంఘటనలో గాయపడ్డప్పటికి ఆయన తీసిన ఫోటోకు అవార్డు కూడా లభించింది.

సంపెట సుధాకర్ ప్రస్తుతం వరంగల్ ఆంధ్ర జ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్న సంపెట సుధాకర్ మంచి ప్రొఫెషనలిజం కలిగిన ప్రెస్ ఫోటోగ్రాఫర్. పెద్దగా అవార్డులకోసమని కాకుండా బెస్ట్ వార్తాఅంశానికి గాను తానూ తీసిన ఫోటోలకు అవార్డులు తనకు తెలియకుండానే దక్కాయి.

కె. రమేష్ వరంగల్ లోకి ప్రస్తుత పేస్ ఫోటోగ్రాఫర్లలో జూనియర్ గానే ఉన్నప్పటికి వాటా పరమైన ఫోటోలు తీయడంలో సీనియర్ గానే ఉంటాడు. 2010 లో ప్రెస్ ఫోటోగ్రాఫర్ గా రంగ ప్రవేశం చేసిన రమేష్ ప్రధానంగా తీసిన తెలంగాణా ఉద్యమ ఫోటోలు తన కెరీర్ లో గొప్పవి.

డీ.పి.ఆర్.ఓ కార్యాలయ ఫోటో గ్రాఫర్లు పేరుకు ప్రభుత్వ ఉద్యోగులైనా ప్రెస్ ఫోటోగ్రాఫర్లకు తీసిపోని వార్తా ఫోటోలను తీయడంలో వరంగల్ డీపీఆర్ఓ కార్యాలయం ఫోటోగ్రాఫర్లు ముందువరసలో ఉన్నారు. తాడూరి సుధాకర్, విదుమౌళి, విష్ణు మోహన్ లు జిల్లాలో జరిగే అన్ని అధికారిక కార్యక్రామాల ఫోటోలు తీయడంలో సిద్ధ హస్తులు. కలెక్టర్, మంత్రులతో నిరంతరం ఒక సమయం లేకుండా ఎప్పుడంటే అప్పుడు సిద్ధంగా ఉండడం ద్వారా డీపీఆర్ఓ కార్యాలయ ప్రతిష్టలు ఇనుమడించడంలో వీరి పాత్ర ఎంతగానో ఉంది. వై. సంపత్, జగన్ లు కూడా పనిచేసినా వారు పదోన్నతిపై ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇక, ఆఫీస్ లోని ఆల్ రౌండర్ దేవి ప్రసాద్ కూడా మంచి టైమింగ్ తో ఫోటోలు తీస్తాడు.

వరంగల్ లో మరికొందరు కూడా మంచి నిబద్ధత కలిగిన ప్రెస్ ఫోటోగ్రాఫర్లున్నారు. కొందరి పేర్లు జ్ఞాపకం రావడంలేదు. వీరందరిలో ఒక ప్రత్యేకత ఏమంటే, ప్రతి ఒక్కరు తమ తోటి ప్రెస్ ఫోటోగ్రాఫర్లను నిరంతరం గమనిస్తూనే, వినూత్న ఫోటోలకు వేర్వేరుగా ప్రయత్నిస్తూ ఉంటారు. గతంలో వరంగల్ లో పనిచేసి వెళ్లిన బషీర్, సంపత్ లు కూడా విశేష సేవలందించారు. వీరందరి మధ్య అంతర్గతంగా ప్రొఫెషనల్ పోటీ తత్వం ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే, వరంగల్ ప్రెస్ రిపోర్టర్లకు మంచి పేరు వచ్చాయంటే అందుకు, వారి వెనుకనే ఉన్న ప్రెస్ ఫోటోగ్రాఫర్లే కారణం. అందరికి ప్రపంచ ఫోటోగ్రఫీ శుభాకాంక్షలు

**కన్నెకంటి వెంకట రమణ,**
**పూర్వ డీపీఆర్ఓ,**
**వరంగల్ జె.డీ. సమాచార శాఖ**

# ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి

- **ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి**
- **ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**ములుగు, ఆయుధం;** ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ ల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పెట్టకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగం అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు హితవు పలికారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఎస్సీ ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా మూడు మాసాలకు ఒకసారి డివిఎంసి సమావేశాలు నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మూఢ నమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై, అవి అందరికీ సమానమనే విషయాన్ని అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, ఏ ఎస్ పి ఏటూరు నాగారం మనన్ భట్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి ఆర్ ఓ రవి కుమార్, ఎస్సి అభివృద్ధి అధికారి కొమురయ్య, పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
- **మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను ప్రారంభించాలి**
- **డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలి**




**హనుమకొండ, ఆయుధం:** సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నిస్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి నుంచి వచ్చే అభిప్రాయాలు, క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ జరగని ఓటర్ల వివరాలను పరిశీలించాలని, సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టి, సంబంధిత ఓటర్లకు తమ వివరణను అందించే అవకాశం కల్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోటీసుల జారీ అనంతరం ఓటర్ల నుంచి అందే వివరణలు, సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీసీ లో కలెక్టర్ మాట్లాడుతూ... మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా జిల్లాలో అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ వరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వెంకటేష్, వెంకన్న, ఎలక్షన్ సూపరింటెండెంట్ జగత్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

(మొదటి పేజీ తరువాయి..)

నిలిచిపోయాయని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మిగిలిన నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేసి ప్రారంభించామని చెప్పారు. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేసిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం నేరమా అని ప్రశ్నించారు. పరకాల నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే శంకుస్థాపన చేసి ప్రారంభించిందని, ఇది ప్రజల పట్ల బాధ్యతతో పనిచేసే ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరకాల నియోజకవర్గంలో దాదాపు రూ.484 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు మంజూరు సాధించి అమలు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణానికి శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలోనే తొలిసారిగా పరకాలలో మహిళా డైరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆయన పేరు చెప్పడం విడ్డూరమన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695